
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 40.2 | కనిష్ఠం : 24.7

ANDHRAJYOTHY 5



వనపర్తి
జిల్లా వార్తలు

శుక్రవారం 9 మే 2025

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలి
- జోగులాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు 6

తలసేమియాను తరిమేద్దాం
- నాగర్‌కర్నూల్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్

ధాన్యం అమ్మేందుకు జాగరణ
- మిల్లుల వద్ద భారీగా నిలిచిన వాహనాలు
- రాత్రింబవళ్లు ఎదురుచూపులు 7



పంట మార్పిడితో అధిక దిగుబడులు
- అవసరం మేరకే రసాయన ఎరువులు
- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు
- గద్వాల, వనపర్తి జిల్లాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' 6



వనపర్తి : రైతులకు కరపత్రాలను అందజేస్తున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు



గోప్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

తూకం చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

పెంట్లవెల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు, గోప్లాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం నిబంధన ప్రకారం తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించా లని నిర్వాహకులను ఆదేశించారు. ఎంగంపల్లి తండాలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. అదేవిధంగా పెంట్లవెల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్థులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తార్‌మార్.. టక్కర్ మార్..!

- వనపర్తి జిల్లాలో ధాన్యం కేటాయింపులో వింత పోకడలు
- ముందు బ్లాక్ లిస్టు మిల్లుకు ధాన్యం కేటాయింపులు
- అధికారుల పరిశీలనతో అప్రమత్తమై వేరే మిల్లుకు తరలింపు
- తక్‌పట్టీలు కాకపోవడంతో రైతుల ఖాతాల్లో జమకాని డబ్బులు



పెబ్బేరులోని ఓ మిల్లులో ధాన్యం బస్తాల నిల్వ వివరాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వనపర్తి జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపుల్లో వింత పోకడలు వెలుగులోకి వస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి అయ్యే జిల్లా వనపర్తి. సాగునీటి వనరుల లభ్యత పెరిగిన తర్వాత వరి సాగు కూడా గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణ కూడా ప్రతీ ఏటా ఎక్కువగానే జరుగుతోంది. ఈ జిల్లాలోనే సీఎంఆర్ పెండింగ్ మిల్లర్లు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. సీఎంఆర్ ఇవ్వని మిల్లులు, కేసులు నమోదైన మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయొద్దని ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంది. వనపర్తి జిల్లా పరిధిలో చాలా డీఫాల్ట్ మిల్లులు కూడా ఉన్నాయి. వాటిని బ్లాక్ లిస్టులో చేర్చినప్పటికీ.. ఏదో లొసుగు చూపెట్టి అధికారులు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. అది ఒకవేళ ఉన్నతాధికారులకు తెలిస్తే.. తప్పులను సరిదిద్దుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తాజా ఉదంతం కూడా దాదాపు అలాంటిదే.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని ఓ బాయిల్డ్ మిల్లుకు 2022-2023 వానాకాలం సీజన్‌కు సంబంధించి భారీ మొత్తంలో ధాన్యం కేటాయించారు. నిర్దేశిత గడువు ముగిసినప్పటికీ ఆ మిల్లర్ సీఎంఆర్‌ను అప్పగించలేదు. కొన్నిరోజుల తర్వాత ఆ మిల్లులో తనిఖీలు చేసిన డీఎస్‌వో కాశీవిశ్వనాథ్ బృందం అక్కడ ధాన్యం నిల్వలు లేవని గుర్తించింది. లోతుగా విచారణ చేయగా.. ఆ మిల్లుకు రెండు కోడ్లు ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో అధికారులు మామూళ్లకు ఆశపడి రెండు వేర్వేరు కోడ్లను ఇచ్చినట్లు తేలడంతో, సదరు మిల్లును బ్లాక్ లిస్టులో ఉంచారు. కానీ ప్రస్తుత రబీ సీజన్‌లో తిరిగి ఆ మిల్లుకు ధాన్యం కేటాయించారు.

40 ట్రక్కుల ధాన్యం కేటాయింపు

బ్లాక్ లిస్టులో ఉన్న సదరు మిల్లర్‌కు సంబంధించిన మిల్లు వేరే పేరుతో ఉందనే సాకుతో దాదాపు 40 ట్రక్కుల ధాన్యం కేటాయించారు. దాన్ని నిబంధనలకు విరుద్ధంగా గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని విజయ గోదాముల్లో తొలుత నిల్వ చేశారు. వాస్తవానికి ఒక జిల్లా ధాన్యం మరో జిల్లాలో నిల్వ చేయడానికి లేదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారనే విషయం బయటకు రావడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అధికారులు ఆ 40 ట్రక్కుల ధాన్యాన్ని పెబ్బేరు మండలంలోని ఓ గ్రామంలో ఉన్న మరో బాయిల్డ్ మిల్లుకు తరలించారు. ఇప్పటికే 2022-23 రబీ సీజన్‌లో వేలం వేసిన ధాన్యం మాయం చేసిన మిల్లులకు కూడా ప్రభుత్వం ధాన్యం కేటాయించాలని ఆదేశాలు ఇవ్వడంతో పాటు మిల్లుల సామర్థ్యానికి మించి కేటాయింపులు చేయాలని కూడా చెప్పింది. అయినప్పటికీ అధికారులు బ్లాక్ లిస్టెడ్ మిల్లులకు కేటాయింపులు చేస్తూ, విషయం బయటకు వస్తే తిరిగి సరిదిద్దుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

60 మంది రైతులకు అందని డబ్బు

సాధారణంగా ప్రతీ ఏటా ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, ఏఎంసీల ఆధ్వర్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఆ ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మొదట ఆయా జిల్లాల పరిధిలోని మిల్లులకు కేటాయిస్తుంది. ఎక్కువ ధాన్యం వస్తే మిల్లులు ఎక్కువగా ఉన్న ఇతర జిల్లాలకు తరలిస్తుంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రవాణా టెండర్లు దక్కించుకున్న వారు ఏర్పాటు చేసిన లారీల్లో ఆయా మిల్లులకు పంపిస్తారు. అక్కడ ధాన్యాన్ని తూకం వేసుకుని.. దాని ప్రకారం ట్రక్ షీట్లు జనరేట్ చేసుకుని.. తిరిగి మిల్లర్లు పౌరసరఫరాల శాఖకు పంపిస్తారు. అప్పుడు అధికారులు ట్యాబ్ ఎంట్రీ చేసి.. వాటిని రైతుల ఖాతాల్లో పేమెంట్ కోసం పంపిస్తారు. అయితే పెబ్బేరులో మొదట కేటాయింపులు చేసిన బ్లాక్‌లిస్టు మిల్లు నుంచి తక్‌పట్టీలు జనరేట్ చేయలేదు. దాదాపు 40 ట్రక్కులు పంపించి 16 రోజులపైనే అవుతోంది. ఇప్పుడు వాటిని మరో మిల్లుకు తరలించినప్పటికీ.. ఇంకా తక్‌పట్టీలు జనరేట్ కాలేదు. దీంతో ధాన్యం విక్రయించిన దాదాపు 60 మంది రైతులు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి ఖాతాల్లో డబ్బు జమయ్యేందుకు ఇంకా ఎన్నిరోజులు పడుతుందో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి.

పాలమూరుకు ప్రపంచ సుందరీమణులు
- ఈనెల 16న పిల్లలమర్రి సందర్శన
- పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ విజయేందిర బోయి



పిల్లలమర్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డీ జానకి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మిస్ వరల్డ్ - 2025 పోటీల్లో పాల్గొననున్న సుందరీమణులు ఈనెల 16న పాలమూరుకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పిల్లల మర్రిని సందర్శించనున్నారు. వారి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం పిల్లలమర్రిని సందర్శించిన కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సుందరీమణులు దాదాపు 750 ఏళ్ల చరిత్ర గల పిల్లలమర్రి వృక్షం, పురావస్తు మ్యూజియం, పక్కనే ఉన్న రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయాలను సందర్శించనున్నారని తెలిపారు. వారికి స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సౌండ్, లైటింగ్, పటిష్ఠ భద్రత, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని వివిధ శాఖల అధికారులను అదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ డి జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్‌డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, డీఈవో ప్రవీణ్ కుమార్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయించొద్దు
- ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేశ్‌కుమార్ 6

కారు, ద్విచక్రవాహనం ఢీ
- బాలుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం 6

రక్తమోడిన రైల్వే పట్టాలు
- గద్వాలలో వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరి మృతి 7

భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య
- ఆలస్యంగా వెలుగులోకి..

సహకార సంఘాలకు.. మహర్దశ

- సంఘాల బలోపేతమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- పెట్టుబడి కింద నిధులు
- అధిక ఆదాయ మార్గాలే లక్ష్యంగా జిల్లాలో ఎఫ్‌పీవోలుగా 5 పీఏసీఎస్‌లు

రైతులకు, సంస్థకు మేలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో పీఏసీఎస్‌లకు, రైతులకు మేలు చేకూరనుంది. ఎఫ్‌పీవోగా మా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎంపిక కావటం ఆనందంగా ఉంది. ప్రభుత్వం అందించే నిధులతో వ్యాపార పరంగా సంస్థ అభివృద్ధి చెందడమే కాకుండా రైతులకు పూర్తిస్థాయి మేలు చేకూరుతుంది.

- గజేందర్‌రెడ్డి, కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు

సంఘాలు బలోపేతం కానున్నాయి



ఎంపిక చేయబడిన పీఏసీఎస్‌లు బలోపేతం కానున్నాయి. అర్హత కలిగిన సహకార సంఘాలను క్లస్టర్ల వారీగా ఎఫ్‌పీవోలుగా ఎంపిక చేశాం. వీటికి సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు అందచేశాం. పూర్తి స్థాయి విధి విధానాలు అందాల్సి ఉంది.

-శ్రీనివాస్, పీఏసీఎస్ జిల్లా అధికారి

ధరూర్ ప్రాథమిక వ్యవసాయ కార్యాలయం



అయిజ, మే 8 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ (సింగిల్ విండో, ప్రాథమిక వ్యవసాయ సంఘా)ల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చాలా ప్రాంతాలలో ఈ సంస్థలు రైతు సంస్థలుగా మాత్రమే కొనసాగుతున్నాయి. ఒకటి, రెండు తప్ప అభివృద్ధి విషయంలో చాలా సంఘాలు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సంస్థను నడిపించలేక, సిబ్బంది జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాయి. ఇలాంటి వాటికి జీవం పోయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకుగాను సంస్థలను ఎఫ్‌పీవో(ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్)గా మార్పుచేసింది. ఇక నుంచి సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మారనున్నాయి.

గద్వాల జిల్లాలో

దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తిదారుల సంస్థ)లుగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 908 పీఏసీఎస్‌లు ఉండగా అందులో మొదటి విడతగా 311 సంఘాలకు మాత్రమే అవకాశం కల్పించింది. అందులో జోగులాంబ గద్వాల జిల్లాలో 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా 5 సంఘాలను మాత్రమే ఎంపిక చేసింది. అందులో గద్వాల, ధరూర్, మానవపాడు, అలంపూర్, కలుగోట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)తో అవగాహన ఒప్పందాలు చేసే ప్రక్రియను సహకార శాఖ ప్రారంభించింది. మరో రెండు విడతల్లో మిగతా వాటికి అవకాశం కల్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తక్కువ ధరకు వ్యవసాయ పనిముట్లు

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చిన్న, సన్నకారు రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశ్యంతో కేంద్రం ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటును ప్రోత్సహించదలచింది. వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరకు అందుబాటులో ఉంచటం, పంట ఉత్పత్తులకు విలువలు జోడించటం, వ్యవసాయ ఉత్పత్తులకు అధిక మార్కెటింగ్ లభించేలా చేయటం, అధిక ఆదాయాలు వచ్చే మార్గాలను అన్వేషించటం, విత్తనోత్పత్తిని ప్రోత్సహించటం లాంటి కార్యకలాపాలు ఎఫ్‌పీవోల ద్వారా చేయాల్సి ఉంది.

పీఏసీఎస్‌లకు మ్యాచింగ్ నిధులు

ఎఫ్‌పీవోలుగా మారిన పీఏసీఎస్‌లకు రూ. 15 లక్షలు మ్యాచింగ్ గ్రాంటు కింద అందజేయనున్నారు. ఆదాయ మార్గాలు ఎంచుకుని నిలదొక్కుకోవడానికి సంవత్సరానికి రూ. 6 లక్షలు చొప్పున 3 సంవత్సరాల కాల పరిమితికి గాను మొత్తం రూ. 18 లక్షలు అందచేయదలచారు. ఈ పథకానికి ప్రత్యేక క్రెడిట్ గ్యారెంటీ నిధి కింద కేంద్రం కెటాయింపులు చేస్తుంది. ఎన్‌సీడీసీ, నాబార్డు ద్వారా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

బాబాయ్ అప్పు తీర్చేందుకు.. బాలుడితో వెట్టిచాకిరీ
- నల్లవెల్లిలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



బిజినేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): బాబాయ్, పిన్ని చేసిన అప్పు తీర్చేందుకు 14 ఏళ్ల బాలుడిని చదువు మానిపించి ఓ ఇంట్లో జీతం కుదుర్చి వెట్టి చాకిరీ చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి బంధువులు గురువారం తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన బాలుడికి చిన్నతనంలోనే తండ్రి బోడ పెద్ద మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తల్లి జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బాలుడిని ఇదే మండలంలోని గంగారం గ్రామానికి చెందిన మేనత్త సంరక్షణలో 5వ తరగతి వరకు చదువుకున్నాడు. బాలుడిని వేసవి సెలవుల్లో 10 రోజులు ఉంచుకొని పంపిస్తామని బాబాయ్, పిన్నీ మేనత్తతో నమ్మబలికి స్వగ్రామానికి తీసుకువచ్చారు. వారు చేసిన రూ.లక్ష అప్పు తీర్చేందుకు నల్లవెల్లి గ్రామంలోని ఓ ఇంట్లో జీతం పెట్టారు. పనిచేసే ఇంట్లో అవమానాలు, వారు పెట్టే హింసను తట్టుకోలేక అక్కడి నుంచి పారిపోయి మేనత్త ఇంటికి చేరుకున్నాడు. తనకు జరిగిన ఇబ్బందులను మేన బావ శివకు వివరించాడు. విషయం తెలుసుకున్న బాలుడి బావ నల్లవెల్లి గ్రామానికి వెళ్లి బాబాయ్, పిన్నిలను నిలదీస్తే ఏమీ చేసుకుంటావో చేసుకో అని బెదిరిస్తున్నారని బాలుడి బావ అవేదన వ్యక్తం చేశారు. బాలల సంరక్షణ అధికారులకు ఫిర్యాదు చేసి తమ ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడిపై కనికరం లేకుండా వ్యవహరించిన బాబాయ్, పిన్నీపై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 8 (ఆంధ్రజ్యోతి):మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మునిసిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, ఉపాధి హామీ పథకం,సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో ప్రతీ మండలం నుంచి ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని 1,300 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. అందులో ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేసిన వివరాలు, పెండింగ్‌లో ఉండటానికి కారణాలపై సమీక్ష నిర్వహించారు. రాజీవ్ యువవికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను బ్యాంకులకు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 15 లక్షల పని దినాలు కల్పించాలని నిర్దేశించడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్‌డీవో ఉమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

స్టార్టర్ డబ్బాలో నాగు పాము



నాగుపామును డబ్బాలో బంధిస్తున్న స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్

వనపర్తి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ పరిధిలోని మర్రికుంట పాల కేంద్రం వెనుక సబ్‌స్టేషన్‌లోని మీటర్ బాక్సు కింద ఉన్న ఒక స్టార్టర్ డబ్బాలో పెద్ద నాగుపాము దర్శనమిచ్చింది. రోజుమాదిరిగా విధులకు హాజరైన ఆపరేటర్ రమేశ్ స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లగా అందులో పెద్ద నాగు పాము కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన రమేశ్ వెంటనే స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్‌కు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకొని నాగుపామును చాకచక్యంగా పట్టుకొని బంధించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిని తట్టుకోలేక పాములు చల్లటి ప్రదేశాలకు చేరుకుంటాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సొసైటీ సభ్యులు చిలుక కుమార్ సాగర్, గోపాల్, దేవేందర్, అవినాష్ ఉన్నారు.

పాలు ఇస్తున్న ఆవుదూడ

▸▸ జన్యు సంబంధ లోపం అంటున్న వైద్యులు



కృత్రిమ గర్భ ధారణతో పుట్టిన దూడ పాలిస్తున్న దృశ్యం

కోస్గి మే 8 (ఆంధ్రజ్యోతి) : ఐదు రోజుల ఆవు దూడ పాలు ఇస్తోంది. నారాయణపేట జిల్లా, కోస్గి మండలంలోని చెన్నారం గ్రామంలో ఈ వింత చోటుచేసుకున్నది. దీనిపై పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నారం గ్రామ ఆరోగ్య మిత్ర మల్లప్ప అర్జున్ అనే రైతు దగ్గర ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయించగా, దూడ జన్మించింది. ఆ దూడ పుట్టిన ఐదు రోజులకే రోజూ 250 మిల్లీలీటర్ల పాలు ఇస్తోంది. దీంతో ఆశ్చర్యపోయిన చుట్టుపక్కలవారు పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌కు సమాచారం అందించారు. జన్యు సంబంధలోపంతో ఇలాంటి సమస్య తలెత్తుతుందని ఆయన తెలిపారు. చికిత్సతో సమస్యను పరిష్కరించొచ్చని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఇలాంటి కేసులు చాలా అరుదని తెలిపారు.

చారిత్రక కట్టడాలను సంరక్షించుకోవాలి

▸▸ ఆర్కిటెక్ సరయు మోరే ▸▸ వనపర్తి రాజ ప్రాసాదం పరిశీలన



రాజాగారి బంగ్లాను పరిశీలిస్తున్న ఆర్కిటెక్ సరయు మోరే

వనపర్తి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కట్టడాలను సంరక్షించుకోవాలని ముంబైకి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ సరయు మోరే అన్నారు. వనపర్తి పట్టణంలోని రాజ ప్రసాదాన్ని (రాజావారి బంగ్లా) గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చరిత్రకు ఆనవాళ్లయిన ఇలాంటి కట్టడాలను కాపాడుకోవడం ఎంతో అవసరమన్నారు. రాజ ప్రాసాదం పునర్ధరణకు పూర్తిస్థాయి నమూనాను తయారు చేసి త్వరలోనే ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమర్పించనున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆమెను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బొంబాయి మన్నెంకొండ, చుక్కరాజు, వసీం, పాషా, రఘుయాదవ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీరంగాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. వనపర్తి జిల్లా, శ్రీరంగాపూరం మండలంలో ఈ సంఘటన జరిగింది. వీపనగండ్ల గ్రామానికి చెందిన దాసర్ల తిరుపతయ్య బుధవారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కంచిరావుపల్లి నుంచి సొంత గ్రామమైన వీపనగండ్లకు బయలుదేరాడు. కంబాలాపూర్ జాలు కాలువ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మన్యపురెడ్డి తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

- బాలుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం

పెబ్బేరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు పట్టణ సమీపంలోని సాయిగోపాల బాయిల్డ్ రైస్ మిల్లు వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెబ్బేరుకు చెందిన తెలుగు రాజు, గంధం భరత్(15) లు ద్విచక్రవాహనంపై పెబ్బేరు పట్టణానికి వస్తూ, జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొన్నది. ప్రమాదంలో గంధం భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు తలకు బలమైన గాయమైంది. అతడి ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి వి షమంగా ఉంది. గంధం భరత్ పెబ్బేరుకు చెందిన తొండ వెంకటయ్య వద్ద గొర్రెలకాపరిగా పని చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం అతడి తల్లి గంధం భారతి, ఐదు నెలల క్రితం తండ్రి గంధం సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు నాన్నమ్మ, తాతయ్యల దగ్గరే ఉంటున్నారు. వారి కుటుంబ పరిస్థితి బాగాలేక పోవడంతో అతడు గొర్రెల కాపరిగా పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. మృతుడి తాతయ్య గంధం చిన్న బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ఐదుగురిపై న్యూసెన్స్ కేసు

చిన్నంబావి, మే 8 (ఆంధ్రజ్యోతి) : తరుచూ గొడవలు పడుతున్న అన్నదమ్ములపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన అన్నాదమ్ములు షాలుమియా, నడసహబ్‌లతో పాటు మరో ముగ్గురు తరుచూ గొడవలు పడుతుండటంతో చుట్టుపక్కల వారిని ఇబ్బంది పెడుతున్నారు. దీంతో వారు అయిదుగురిపై పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. గురువారం వనపర్తి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ. 500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



పంటల మార్పిడిపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

▸▸ అవసరం మేరకే రసాయన ఎరువులు

▸▸ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

▸▸ గద్వాల, వనపర్తి జిల్లాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

గద్వాల/ వనపర్తి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్లు నళిని, శంకర్ రైతులకు సూచించారు. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సులో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి కోసం ఎక్కువ మోతాదులో యూరియా, రసాయన ఎరువులను వినియోగిస్తున్నారన్నారు. అవసరం మేరకే వాటిని వాడాలన్నారు. దీంతో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించవచ్చని సూచించారు. సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, వ్యవసాయంలో యంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. హార్టీకల్చర్ అధికారి అక్బర్ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకంతో రైతులు దీర్ఘకాల ఆదాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, తెలంగాణ సీడ్ అధికారి ఆదినారాయణ, ఆయిల్ పామ్ ఫెడరేషన్ అధికారి శశిధర్ గౌడ్, విస్తరణ అధికారి అనూష పాల్గొన్నారు.



గద్వాలలో నిర్వహించిన సదస్సులో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు



కిష్టగిరిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి

పంటలలో తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధిని కచ్చితంగా పాటించాలని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు సూచించారు. వనపర్తి జిల్లా, మండల పరిధిలోని కిష్టగిరి గ్రామంలో గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజారెడ్డి, ఉమ, మహేశ్, శ్రీరాములు, ఉద్యాన శాఖ అధికారి శివతేజ మాట్లాడారు. వివిధ పంటలలో యాజమాన్య పద్ధతులు, రసాయనిక ఎరువుల వాడకం, పురుగు మందుల పిచికారి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే పంటలు సాగు చేయాలన్నారు. విత్తనాలను కొన్నప్పుడు రశీదులు తీసుకొని భద్రపరుచుకోవాలని సూచించారు. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట పైరులైన జీలుగ, జనుము, పిల్లిపెసరలను 40 రోజులు ముందుగానే వేసుకుని, పూత దశలో కలియ దున్నాలన్నారు. అలాగే కోతల అనంతరం కొయ్యలను కూడా భూమిలో కలియదున్నాలని సూచించారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడినిచ్చే సూత్రాలకు సంబంధించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కురుమయ్య, ఏఈవో యుగంధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేయాలి

● నివారణపై బ్రహ్మకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయం : ఎస్పీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): మత్తు ప దార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడంతో పాటు వాటికి ఆకర్షితులు అ యిన యువతను తిరిగి యథాస్థితికి తీసుకువచ్చేందుకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం వారు చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా జిల్లాలో ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించేందుకు బ్రహ్మకుమారీస్ ఈశ్వ రీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యసనముక్త భారత్ అభియాన్ ర్యాలీని గురువారం ఎస్పీ శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారీస్ కేంద్రం దగ్గర జెండా ఊ పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉం డాలని, వాటికి అలవాటు పడి తమ విలువైన బంగారు భవిష్యత్తును వినాశనం చేసుకోవద్దన్నారు. యువత ఎల్లప్పుడు భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడంతో పాటు చెడు వ్యసనాలకు గురైన వారు తిరిగి యథాస్థితికి తీసుకువచ్చేందుకు వారు చేస్తున్న కృషి ఎంతో అభి నందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు పోలీస్ ఎల్లప్పుడు సపోర్ట్‌గా ఉంటుందన్నారు. యువత బంగారు భవిష్యత్తును వినాశనం వై పు తీసుకెళ్తున్న మత్తు పదార్థాలను అరికట్టేందుకు తెలంగాణ పోలీస్ టీఎస్‌ఏబీ కూడా అనే క చర్యలు తీసుకుంటుందనారు.

జిల్లాలో పోలీస్ యంత్రాంగం కూడా రో జూ ఏదో ఒకచోట మత్తు పదార్థాల దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మొ గులయ్య, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వత విద్యాలయం రాజయోగి మంజుల, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

తలసేమియాను తరిమేద్దాం

▸▸ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్



జెండా ఊపి ప్రపంచ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్

కందనూలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తలసేమియాను తరిమేయాలని జిల్లా ఉప వైద్యాధి కారి డాక్టర్ ఎం.వెంకటదాస్ అన్నారు. గురు వారం జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో తలసేమియాపై అవగాహన ర్యాలీని జిల్లా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తలసేమియా అనేది జన్యుపరమైన రక్తరుగ్మత అని తెలియజేశారు. కేవలం సులభమైన రక్త పరీక్ష ద్వారా తలసేమియా వ్యాధిని నిర్ధారించుకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రదీప్, పెద్దముద్దన్న, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి, ఎంఎల్ హెచ్‌పీలు నీరజ్, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ ఎంలు, ల్యాబ్‌టెక్నిషియన్ కల్యాణ్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా నిర్మూలన అందరి బాధ్యత

మన్ననూర్ : తలసేమియా వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని మన్ననూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుగ్యాల సుధాకర్ తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ యుష్ వైద్యాధికారి డాక్టర్ పానుగంటి జాన్సన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయించొద్దు

▸▸ ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేశ్‌కుమార్



ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సీజ్ చేసిన కాలం చెల్లిన మందులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ దుకాణాలలో కాలం చెల్లిన మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్ కుమార్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఔషధ నియంత్రణ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం వనపర్తి పట్టణంలోని శ్రీబాలాజీ, కేడీఆర్ నగర్‌లోని మరో మెడికల్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. 20 రకాల కాలం చెల్లిన మందులను గుర్తించి సీజ్ చేశారు. వివిధ మందులు, యాంటిబయోటిక్స్, గర్భ విచ్ఛిత్తి కిట్ల కొనుగోలుకు సంబంధించి న బిల్లులను దుకాణాల యజమానులు చూపించలేకపోయారు. దీంతో ఆ రెండు దుకాణాలను సీజ్ చేశారు. బుధవారం కూడా త్రినేత్ర, సుధా నర్సింగ్ హోం, శ్రీమానిక్, నాగార్జున ఆసుపత్రులకు సంబంధిత అనుబంధ ఔషధ దుకాణాల్లోనూ తనిఖీలు నిర్వహిం చి, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలను పాటించని మెడికల్ దుకాణాలను సీజ్ చేస్తామని, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వనపర్తి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రష్మి, నాగర్‌కర్నూల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనా థ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

గోపాల్‌పేట, మే 8(ఆంధ్రజ్యోతి) : పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు దొంగలను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రంలోని కోదండరావ స్వామి గుడి ఆవరణలో గు రువారం ఉదయం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరు వ్య క్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. అదే సమయంలో పె ట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పరుగెత్తుతుండగా వారిని వెంటాడి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. వారు మండలం లోని బుద్దారం గ్రామానికి చెందిన బింగి శ్రీకాంత్, వనపర్తిలోని శంకర్ గం జ్‌కు చెందిన మండ్ల నరేశ్ అని గుర్తించారు. ఇద్దరూ కొన్ని కేసుల్లో జైలుకు వెళ్లగా, అక్కడే వారికి పరిచయం అయింది. బయటికి వచ్చిన తర్వాత 3 రోజుల కిందట బుద్దారం గ్రామంలోని అర్జునయ్య ఇంట్లో దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారు. వారి నుంచి నగదును స్వాధీనం చేసుకొని కోర్టు లో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలి ంచినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నంబావిలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

వనపర్తి/నారాయణపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత కొనసాగుతోంది. గురువారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి మండలంలో 24.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్‌లో గరిష్ఠం 39, కనిష్ఠం 28 డిగ్రీలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 38.7, కనిష్ఠం 26 డిగ్రీలు, నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠం 36 డిగ్రీలు, కనిష్ఠం 24 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీలు, కనిష్ఠంగా 25 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత నమోదైంది.

జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

▸▸ ధాన్యం దింపుకోవాలని డిమాండ్ ▸▸ సర్దిచెప్పిన మిల్లు యాజమాన్యం ▸▸ ధర్నాను విరమించిన అన్నదాతలు



రైతులతో మాట్లాడుతున్న రైస్‌మిల్లు యాజమాన్యం

కృష్ణ, మే 8 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లు యాజమాన్యం ధాన్యం దింపుకోవాలని డిమాండ్ చేస్తు రైతులు గురువారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండల రైతులు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల లోడ్‌లో వాహనాలను కృష్ణ మండలంలోని గుడెబల్లూరు గ్రామ శివారులోని పారిజన్య రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన లిమిట్ వరకు ధాన్యాన్ని దింపుకున్నామని, గోడౌన్ నిండుగా ఉందని, ధాన్యం దింపుకోవడానికి వీలు లేదని మిల్లు యాజమాన్యం రైతులకు సర్ది చెప్పి వినకుండా రైతులు మిల్లు ఎదుట బైఠాయించారు. అంతకుముందే ఎస్ఐ నవీద్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్ది చెప్పారు. ధాన్యాన్ని మిగతా రైస్‌మిల్లుల వద్దకు తీసుకెళ్లే విధంగా సూచించారు. శాంతించిన రైతులు ధాన్యాన్ని ఇతర రైస్‌మిల్లుకు తరలించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్

కందనూలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంక్ ఉన్నతాధికారులు, జిల్లా ఎలక్ట్రిసిటీ బోర్డు ఉన్నతాధికారులతో జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 14న జరగబోయే రెండవ జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎన్ఐ యాక్ట్‌లు, ఇతర సివిల్ కేసులకు సంబంధించి నోటీసులు పంపించి రాజీమార్గం ద్వారా సత్వరంగా కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. దీంతో సమయాభావం, ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. రాజీమార్గంతో ఇరు వర్గాలు సుఖసంతోషాలతో జీవించవచ్చని, రాజీమార్గమే రాజమార్గమన్నారు. జిల్లాలో ఎలక్ట్రిసిటీకి సంబంధించిన కేసులు అన్నీ రాజీఅయ్యే కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఇవే కాకుండా రాజీ అయ్యేయ క్రిమినల్ కేసులు, పెటి డ్రంకెన్ డ్రైవ్ కేసులు, భూ వివాదానికి సంబంధించిన సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సివిల్ కేసుల్లో కోర్టు ఫీజు తిరిగి ఇస్తారని, కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీమాసుల్తానా, బ్యాంక్ ఉన్నతాధికారులు, ఎలక్ట్రిసిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ చెల్లించాలి

▸▸ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌తో పాటు కంపన్సేటరీ సెలవులు మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.కృష్ణ, ఎం.శ్రీధర్‌శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వేను జిల్లాలోని ఉపాధ్యాయులు ఎన్యుమరేటర్లుగా, సూపర్‌వైజర్లుగా పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఈ క్రమంలోనే ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా సర్వేలో పాల్గొన్నారని తెలిపారు. కానీ, సర్వేకు సంబంధించిన రెమ్యునరేషన్ ఆరు నెలలు కావస్తున్నా చెల్లించలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సర్వే రెమ్యునరేషన్‌కు తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సి.తిరుపతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం.కురుమయ్య, జిల్లా నాయకుడు డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మినీ డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి


ఉప్పరి నరసింహులు (ఫైల్)

మల్దకల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన ఉప్పరి నరసింహులు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి గ్రామా వాసి ఉప్పరి నరసింహులు (45) బుధవారం రాత్రి గద్వాల పట్టణం నుంచి బింగిదొడ్డి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా శేషంపల్లి పీజేపీ కాలువ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న మినీ వాహనం ఢీకొనడంతో నరసింహులు తలకు, ముఖం, కాలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వలో చికిత్సలో పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. డ్రైవర్ శ్రీధర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి..

ఎర్రవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన నారాయణ (30) బుధవారం ఎర్రవల్లికి దేవర సందర్భంగా వచ్చి మద్యం సేవించాడు. కాగా క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. నారాయణ కొంత కాలం నుంచి మద్యానికి బానిస అయినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. అన్న రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్‌తో అడవి పందిని ఢీకొని యువకుడు..

మూసాపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై అడివిపందిని బైక్‌తో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట ఎస్‌ఐ ముల్కలపల్లి వేణు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం(28), పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన నరేష్ సంకలమద్ది శివారు వేముల వద్ద రోడ్డు నిర్మాణ క్యాంపులో కాంట్రాక్టర్ హన్మంతురెడ్డి వద్ద డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి పని ముగించుకుని బైక్‌పై ఇద్దరు వేముల బీటీ రోడ్డు నుంచి జాతీయ రహదారి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై అడవిపంది అడ్డుతగిలి వేగంగా ఢీకొట్టింది. శ్రీశైలం, నరేష్ గాయపడ్డారు. శ్రీశైలానికి బలమైన గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శ్రీశైలం భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న ఆటో : ఇద్దరికి గాయాలు


దెబ్బతిన్న ఆటో

ఎర్రవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని గద్వాల రోడ్డులో స్కంద వెంచర్ ఎదుట గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొండేరు గ్రామానికి చెందిన బోయరాముడు, ముష్టి లక్ష్మన్న ఆటోలో గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు కల్వర్టును ఆటోతో ఢీకొట్టాడు. డ్రైవర్ బోయరాముడు, ముష్టి లక్ష్మన్నలకు గాయాలయ్యాయి. వీరిని కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం


పొలంలో కాలిబూడిదైన ద్విచక్ర వాహనాలు

చిన్నంబావి, మే 8 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని బెక్కెం గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. పెబ్బేరు మండలం సూగూరు గ్రామానికి చెందిన హరీశ్, తిరుపతి గొర్రెలను మేపడానికి వచ్చారు. ఈ క్రమంలో పొయ్యి పెట్టుకొని వంటలు చేసిన తర్వాత నిప్పును పూర్తిగా ఆర్పలేదు. దీంతో నిప్పు గాలికి రగిలి చుట్టూ ఉన్న వరి కొయ్యలు అంటుకుని అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి.

యువతి అదృశ్యం: కేసు నమోదు

తెలకపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తప్పిపోయినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. యువతి ఈ నెల 7న తన తల్లిదండ్రులు ఇంటి వద్ద లేని సమయంలో సాయంత్రం వెళ్లిపోయిందని, అందుకు అదే గ్రామానికి చెందిన చీర్ల శివకృష్ణపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

కల్వకుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి మూడు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురిని, వాహనాలకు సరైన ధ్రువపత్రాలు, నెంబరు ప్లేట్‌లేని 14 మందిని గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. న్యాయాధికారి నలుగురికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. సరైన పత్రాలు, నెంబరు ప్లేట్లు లేని 14మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. తెలిపారు.

లారీ కాంట్రాక్టర్‌ను చితకబాదిన రైతులు

» డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఆగ్రహం

కృష్ణ, మే 8(ఆంధ్రజ్యోతి) : లారీ కాంట్రాక్టర్, కారు డ్రైవర్‌ను రైతులు చితకబాదిన ఘటన మంగళవారం రాత్రి టై రోడ్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. టై రోడ్డులో రాత్రి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు సమకూర్చిన కాంట్రాక్టర్, డ్రైవర్ ఇద్దరు కలిసి రైతుల నుంచి డబ్బులు తీసుకునేందుకు అక్కడికి చేరుకున్నారు. మరో రైతు తనకు లారీ సర్దుబాటు చేయాలని కోరగా, డ్రైవర్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రైతు చేసేదేమీ లేక ఇంటికెళ్లి డబ్బులు తీసుకొచ్చాడు. కాంట్రాక్టర్ తన కారు డ్రైవర్‌తో అక్కడే మిగతా రైతులు మాట్లాడుతుండగా మాగనూరు మండలానికి చెందిన కొందరు రైతులకు లారీలు సర్ధుబాటు చేయకుండా కృష్ణ మండలంలో డబ్బులు ఇచ్చిన వారికి లారీలు ఏర్పాటు చేస్తావా అని ప్రశ్నించారు. దీంతో కాంట్రాక్టర్‌కు, రైతులకు వాగ్వాదం చోటు చేసుకుంది. విసుగు చెందిన రైతులు లారీ కాంట్రాక్టర్‌ను చితకబాదారు. కాగా కాంట్రాక్టర్ తన ఒక్కో రైతు నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు లారీ డ్రైవర్ల ద్వారా వసూలు చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నవీద్ తెలిపారు.

నిప్పంటుకొని 40 బస్తాల ధాన్యం దగ్ధం

ఊట్కూర్ మే 8 (ఆంధ్రజ్యోతి) : పొలం వద్ద సంచుల్లో నింపి నిల్వ చేసిన ధాన్యం నిప్పంటుకున్న ఘటన గురువారం సాయంత్రం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామంలో చోటు చేసుకుంది. రైతు ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బిజ్వార్ చెందిన తోక పెద్ద ఎల్లప్ప ధాన్యాన్ని 50 సంచుల్లో నింపి పెట్టాడు. కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ ఉండటంతో రెండు రోజుల్లో అమ్ముదామని పొలం వద్ద అలాగే ఉంచారు. గురువారం సాయంత్రం సంచులకు నిప్పంటుకోవడంతో రైతులు పొలం వద్దకు వెళ్లి మంటలను ఆర్పారు. అప్పటికే 40 బస్తాల ధాన్యం కాలిపోయింది. దాదాపు రూ.50వేల వరకు నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న రైతు సంఘం నాయకులు మల్లేశ్, రాములు ఘటనా స్థలానికి చేరకుని పరిశీలించారు. పంట నష్టపోయిన రైతు ఎల్లప్పను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం అమ్మేందుకు జాగరణ


ఊట్కూర్ మండలంలోని మల్లెపల్లి పత్తి మిల్లు వద్ద ధాన్యం లోడుతో నిలిచిన వాహనాలు

» మిల్లుల వద్ద భారీగా నిలిచిన వాహనాలు

» రాత్రింబవళ్లు ఎదురుచూపులు

» కూలీల కొరత, నిల్వ చేసే స్థలం లేక కొనుగోళ్లలో ఆలస్యం

ఊట్కూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల పరిస్థితి అమ్మబోతె అడవి.. కొనబోతె కొరివి అన్న చందంగా మారింది. వర్షాలు బాగా కురిసి చెరువులు నిండటంతో సంతోషంగా రబీ సీజన్‌లో బోరుబావులు, చెరువుల కింద వరిని పండించడానికి పోరాటం చేస్తే.. అమ్మేందుకు మరో పోరాటం తప్పటం లేదు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో తిప్రాస్‌పల్లి, ఊట్కూర్, చిన్నపొర్ల, పెద్దజట్రంలో పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ధాన్యం నిల్వ ఉంచడానికి స్థలం లేకపోవడంతో తిప్రస్‌పల్లి వద్ద, ఊట్కూర్ రైస్‌మిల్లుతో పాటు మల్లెపల్లి వద్ద జిన్నింగ్ మిల్లులో నిల్వ చేస్తున్నారు. రైతులు పంటను అమ్మడానికి రోజుల తరబడి పడిగాపులు పడుతున్న పరిస్థితి మండలంలో నెలకొంది. రబీ సీజన్‌లో మండలంలో 6,025 ఎకరాల పంటను సాగు చేశారు. దీనికి 1.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బయట వరి ధర పడిపోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల వాహనాలు క్యూ కట్టాయి. దీంతో మిల్లు వద్ద మూడు రోజుల నుంచి పడిగాపులు కాస్తున్నారు. ప్రతీ రోజు మిల్లుల వద్ద కిలోమీటర్ పొడవునా దాదాపు 100 వాహనాలు నిలుస్తున్నా నిల్వ చేసే స్థలం లేక, కూలీల కొరత కారణంగా రోజుకు 15 నుంచి 20 వాహనాలు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు వాహనాల వెంట జాగరణ చేస్తున్నారు. మల్లెపల్లి మిల్లు వద్ద కూలీలు లేక ఇబ్బంది పడుతుండగా, తిప్రస్‌పల్లి వద్ద నిల్వ చేసే స్థలం లేక కొనుగోలు నిదానంగా జరుగుతుంది. స్థలం లేకపోతు కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించి మిల్లులను ఖాళీ చేయాలని రైతులు కోరుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎండాకాలం వాహనాల వద్ద ఉండాలంటేనే భయమేస్తుందని రైతులు అంటున్నారు. అధికారులు వెంటనే ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రోడ్డుపైనే ట్రాక్టర్ కింద సేద తీరుతున్న రైతులు



మూడు రోజులవుతుంది

మిల్లు వద్ద అమ్మడానికి వచ్చి మూడు రోజులు అవు తుంది. కూలీలు ఎనిమిది మందే ఉన్నారని, అన్‌లోడింగ్‌కు ఇబ్బంది అవుతుందని చెబుతున్నారు. రాత్రి ఉండగలం కానీ.. ఎండలో ఇబ్బందిగా ఉంది.

\- నర్సప్ప, రైతు, టెకులపల్లి, మక్తల్ మండలం



ఎన్ని రోజులు ఉండాలో తెలీదు

మిల్లు వద్దకు వచ్చి మూడు రోజులు అవుతుంది. ఏదైనా అంటే కూలీలు లేరని అంటున్నారు. ఎన్ని రోజులు ఉండాలో అర్థం కావడం లేదు. ధాన్యం గోదాములకు తరలించడంతో పాటు కూలీలను పెంచేలా చర్యలు తీసుకోవాలి.

\- అశోక్, రైతు, కొత్తగార్లపల్లి, ఊట్కూర్ మండలం

రక్తమోడిన రైల్వే పట్టాలు

» వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు

గద్వాల సర్కిల్/ గద్వాలక్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనలో రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, మరొకరికి రెండు కాళ్లు విరిగిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టాలుదాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. గద్వాల రైల్వే పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపిన కథనం మేరకు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి చెందిన కృష్ణంనాయుడు (35) బుధవారం గద్వాల మండలం మేలచెర్వులో గ్రామంలో నిర్వహించిన గ్రామ దేవతల వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యాడు. గురువారం తెల్లవారుజామున గ్రామ శివారు రైల్వే పట్టాల సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. పట్టాలుదాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురై కృష్ణంనాయుడు మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అనారోగ్యం తట్టుకోలేక..

జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఎరుకలి శ్రీను(22) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఎరుకలి శ్రీను గద్వాల జిల్లా కేంద్రంలో ఎంఎల్‌టీ పూర్తి చేశాడు. ఆరు నెలల నుంచి తన ఆరోగ్యం బాగాలేదని, చనిపోతానని తన తల్లికి భారం కాకూడదనే చెబుతుండేవాడన్నారు. ఆ క్రమంలోనే గురువారం రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం..

ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకునేందుకు రైలు కింద పడ్డాడు. లోకోపైలట్ అప్రమత్తం కావడంతో రెండు కాళ్లు తెగినా.. ప్రాణాలతో బయటపడ్డాడు. గద్వాల పురపరిధి చింతలపేటకు చెందిన గుడ్డెందొడ్డి గోపాల్ (62) అనారోగ్యంతో పాటు కుటుంబ సమస్యల కారణంగా గురువారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. గద్వాల నుంచి పిలిగుండ్ల మీదుగా రాయచూర్‌కు వెళ్తున్న డెమో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు పట్టాలపై పడుకున్నాడు. లోకో పైలట్ గమనించి రైలును నిలిపివేశాడు. అప్పటికే గోపాల్ రెండు కాళ్లపై రైలు వెళ్లడంతో తెగిపోయాయి. అపస్మారక స్థితిలో ఉన్న గోపాల్‌ను స్థానికుల సహాయంతో లోకోపైలట్ బయటకు తీశాడు. సమాచారం అందుకున్న గద్వాల రైల్వే పోలీసులు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కర్నూలు తీసుకెళ్లారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ సౌత్ జోన్ జాతీయస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి శేషు, పవన్, వనపర్తి జిల్లా నుంచి సుమతి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైలో జరిగే సౌత్‌జోన్ జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జడ్చర్ల మినీస్టేడియంలో అసోసియేషన్ సభ్యులు అభినందించారు. గోవింద్ నాయక్, తఖియొద్దీన్, రాంరెడ్డి, అభిలాష్, శివకుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడి

» నలుగురికి గాయాలు ఆసుపత్రిలో చికిత్స

హన్వాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో నలుగురు చిన్నారులకు గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వేపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఇంటి ఎదుట పిల్లలు ఆడుకుంటుండగా రెండు కుక్కలు ఆరేళ్ల బాలుడిపై దాడి చేశాయి. భయపడి ఇంట్లోకి పరుగెత్తగా వెంటపడి కరిచాయి. చుట్టు పక్కల వారు కట్టెలతో బెదిరించినా వారిపైకి ఎగబడ్డాయి. మరి కొంత దూరంలో ఇద్దరు చిన్నారులపై దాడి చేసి కరిచాయి. బుధవారం కూడా ఓ చిన్నారిని కరిచాయి. ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు కావడంతో హన్వాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పెద్దవారిపై కుక్కలు కరిచేందుకు వెళ్లడంతో వారు కొట్టి చంపారు. రోజు రోజుకు గ్రామంలో కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ధాన్యం లారీ బోల్తా

చారకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఓవర్ టేక్ చేయబోయి ధాన్యం లారీ బోల్తా పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ మండలంలోని తిమ్మాయిపల్లి సమీపంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి వద్ద ఆటోను ఓవర్ టెక్ చేయబోయి అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న ధాన్యం సంచులు కిందపడిపోయాయి. డ్రైవర్ పాండునాయక్‌కు సల్పంగా గాయాలు కావడంతో స్థానికులు 108 సమాచారం అందించారు. ఘటనా స్థలంలోనే డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ శంషుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఐదు రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

» రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి


రామనాయుడు, ఏఆర్ కానిస్టేబుల్ (ఫైల్)

అయిజ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులలో తన వివాహం జరుగుతుందని, సంతోషంగా గడపాలని కలలు కన్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన బుచ్చన్న చిన్న కుమారుడు రామనాయుడు (26) హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నా డు. ఈ నెల 14వ తేదీన తన వివాహం జరగాల్సి ఉంది. ఆక్రమంలో తన విధులకు సెలవు పెట్టి, పత్రికలు పంపిణీ చేసి బుధవారం రాత్రి వెంకటాపూర్ మీదుగా తన గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. తనగల గ్రామం నుంచి వెంకటాపురం గ్రామం వైపునకు త్రివేణ్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు మూడు బైక్‌లపై వచ్చారు. తన స్వగ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, కిష్టాపూర్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో త్రివేణ్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. రామనాయుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాత్రి కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమంగా మారటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య

» ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

జడ్చర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వేధిస్తున్నాడని భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఈ నెల 5న రాత్రి 7గంటల ప్రాంతంలో జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చింతకుంటరాములు, తిరుపతమ్మ భార్యాభర్తలు కిరాణం దుకాణం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చింతకుంట రాములు మద్యం తాగేవాడని, భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరిగేవని తెలిపారు. ఈ నెల 5న రాత్రి గొడవపడి తిరుపతమ్మ, భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఇదే సందర్భంలో పరిసర ప్రాంతంలో ఉన్న వారంతా సంచులతో మంటలను ఆర్పి, చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చింతకుంట రాములు చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఫిర్యాదు రాలేదని సీఐ కమలాకర్ తెలిపారు.

నిల్వలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

» మహబూబ్ నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్

» ఫర్టిలైజర్ డీలర్లకు పీవోఎస్ మిషన్ల పంపిణీ


డీలర్లకు పీవోఎస్ మిషన్లు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్

పాలమూరు/ జడ్చర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఎల్-1 స్కానర్‌తో కూడిన పీవోఎస్ స్మార్ట్ డివైజ్‌లు ఫర్టిలైజర్ డీలర్లకు ఉపయోగపడుతావని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, సహాయ సంచాలకుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలం దివిటిపల్లి రైతువేదికలో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై డివైజ్‌లను పంపిణీ చేశారు. ఫర్టిలైజర్ డీలర్లు అందరూ ఈపీవోఎస్ మిషన్‌లో రైతుల వివరాలు నమోదు చేయకుండా ఎలాంటి ఫర్టిలైజర్ల అమ్మకాలు చేపట్టరాదన్నారు. ఒకే రైతుకు ఎక్కువ మొత్తంలో అమ్మకాలు చేపట్టరాదన్నారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ఫర్టిలైజర్ డీలర్లకు పాత పీఓఎస్ మిషన్ల స్థానంలో కొత్త వాటిని ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. డీలర్లు మరింత బాధ్యతతో పనిచేసి రైతులకు సహాయం చేయాలన్నారు.

● కొనుగోలు చేసిన ప్రతీ రైతు వివరాల కోసమే ఈపీవోఎస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్ తెలిపారు. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లిలోని రైతువేదికలో గురువారం డివిజన్‌లోని ఫర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు.

ఇంటర్వ్యూ

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు - ఎస్‌ఐ రజిత



రేవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రజిత అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవల్లి మండల ఎస్‌ఐ రజిత తెలిపారు.

అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసిన గ్రామాలేవి?

మండలంలోని పాతతండా, గౌరీదేవిపల్లి, కేశంపేట, శానాయిపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం.

అవగాహన కార్యక్రమాల్లో సూచించిన విషయలేవి?

డ్రంకెన్ డ్రైవ్, సోషల్ అవెర్నెస్, గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలపై అవగాహన కల్పించాం.

యువతకు మీరిచ్చే సూచన ఏమీ?

ప్రస్తుతం వేసవి కాలం కావడం, ముఖ్యంగా యువత ఈతకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. సమాజంలో అల్లర్లు సృష్టిస్తే వారికి జరిమానాతో పాటు చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం.

ఇటీవల కాలంలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై తీసుకున్న చర్యలేవి?

మండలంలో ఇటీవల పోక్సో కేసు నమోదు చేశాం. అదే విధంగా ఎనిమిది మందిని బైండోవర్ చేశాం.

మండలంలో సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలేవి, లేని గ్రామాలేవి?

ముఖ్యంగా తలుపునూరు గ్రామం నుంచే సమస్యలు వస్తున్నాయి. రేవల్లి మండల కేంద్రంలో ప్రశాంతంగా ఉంది. వీటితో పాటు గౌరిదేవిపల్లి గ్రామంపై కూడా దృష్టి సారించాలి.

కార్యాలయానికి సొంత భవనం ఉందా?

సొంత భవనం లేదు. అద్దె భవనంలో ఏర్పాటు చేశాం. నెలకి అద్దె చెల్లిస్తున్నాం.

న్యూస్ బాక్స్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కొత్తకోట, మే 8 (ఆంధ్రజ్యోతి) : లోడుతో వచ్చిన ధాన్యం బస్తాలను దించుకోకుండా రైస్ మిల్లు యజమానులు రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం అమడబాకులలోని లక్ష్మీనరసింహ రైస్‌మిల్లును సందర్శించారు. దొడ్డు రకం వస్తే దింపుకోను అని చెప్పడానికి వీలు లేదన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు దరఖాస్తులు

అమరచింత, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు కోసం చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు గోవిందయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద ప్రతిష్టాత్మకంగా ఈ అవార్డులను అందజేస్తుందని అన్నారు. ఈ అవార్డుకు చేనేత కళాకారులు, డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యం కలిగిన నేత కార్మికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో విజేతగా నిలిచిన నేత కార్మికులకు రూ.25 వేల నగదు పురస్కారంతో పాటు మెమొంటో, శాలువాతో సత్కరించనున్నట్లు తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులు దరఖాస్తు ఫారంతో పాటు వారు తయారు చేసిన శాంపిల్ డిజైన్‌ను చేనేత జౌళి శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని, మిగతా వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పల్లె దవాఖానాలో సాధారణ కాన్పులు పెంచాలి

పాన్‌గల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్స్‌కు, హెల్త్ సూపర్‌వైజర్స్‌కు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో వచ్చే వడదెబ్బ, మిషన్ ఇంద్ర ధనుస్సుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వాటికి సరిపడా జాగ్రత్తలు తీసుకోవాలని తమ పిల్లల క్షేమంపై రోజు వారి సమాచారం తీసుకోవాలని అన్నారు. రామయ్య, తార శశాంక్, మైత్రీ, నాగరాజు, నిహారిక, సుమనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల రంగం పటిష్టతకు శక్తికి మించి కృషి

వనపర్తి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల రంగం పటిష్టతకై శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో నీటిపారుదల రంగాన్ని పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్టులతో పాటు అనేక మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని రూ.1,323 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ సీఈ సత్యనారాయణరెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఈ వెంకట్‌రెడ్డి, ఈఈలు కేశవులు, జగన్మోహన్ రెడ్డి, డీఈలు నరేందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, వెంకటరమణదేవి, రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి



జ్ఞాపికలు పొందిన విద్యార్థులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవడమే కాకుండా క్రీడలు, వ్యాయామంపై శ్రద్ధ పెట్టి సమతుల్యతను పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఇటీవల వచ్చిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు గురువారం ఐడీవోసీ సమావేశ మందిరంలో అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని అందువల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించారని అభినందించారు. విద్యార్థులకు జ్ఞాపిక అందజేసి అభినందించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

29వ ర్యాంకు ఆమోదయోగ్యం కాదు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో వనపర్తి జిల్లా 29వ స్థానం పొందడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా బోధన అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి ఫలితాలపై సమీక్ష నిర్వహించారు.

లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు

లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ నుంచి డ్రాఫ్ట్‌మన్ (సివిల్), డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసి అభ్యర్థులకు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులకు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో మొత్తం 50 పని దినాల్లో తెలంగాణ అకాడమీ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందని వివరించారు.

'ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర'



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వీపనగండ్ల, మే 8, (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పోడుస్తూ.. ఎత్తివేసే కుట్ర చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సు కనీస సౌకర్యాలు ఎత్తివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కూలీలు రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న బాల్ నరసింహ

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహ డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని పట్టణ వర్తక సంఘం భవనంలో వనపర్తి జిల్లా సమితి సభ్యుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మోష అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాకిస్తాన్‌లో ఉన్నటువంటి ఉగ్రవాదులను అంతమొందించే విధంగా కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను భారత కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తుందని, అలాగే దేశ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత కూడా దేశ ప్రధానమంత్రిపై ఉందని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, చంద్రయ్య, శ్రీహరి, అబ్రహం, నరసింహ శెట్టి, రమేష్, గోపాలకృష్ణ, కురుమయ్య, రవీందర్, కుతుబ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదయ్య

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ పాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్లో డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతీ మండలం నుంచి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాల్లో ఎన్నికైన సర్పంచులు కొందరు విద్యావంతులు, మరికొందరు అక్షరాస్యత లేని వారు సైతం ఉంటారన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. డీపీవో సురేష్ కుమార్, కృష్ణ, శ్రీనివాస్, డా.హనుమంత్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వనపర్తి 3వ వార్డులో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి, మే 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో పార్టీ నాయకులతో కలిసి కాలనీలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగురవేయాలని సూచించారు. ఆ పార్టీ నాయకులు శ్రీశైలం, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, లోక్‌నాథ్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాములు, సూగూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

ఖిల్లాఘణపురం : మండలంలోని మామిడిమాడలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం దళితులకు ఇళ్ల కేటాయింపు సమస్యలపై తహసీల్దార్ సుగుణతో మాట్లాడారు. ఇళ్ల కేటాయింపుపై దళితుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. బుచ్చిబాబు గౌడ్, నవీన్ రెడ్డి, శివ శంకర్, గోపి ముదిరాజ్, రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వనపర్తి విద్యా విభాగం, మే 8 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ ఇంజినీరింగ్ కాలేజీలో జువాన్ 2025 పేరిట వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్ డా.బి. బాలు నాయక్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని లక్ష్య సాధనకై నిరంతరం కృషి చేయాలన్నారు. బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి లాంగ్‌జంప్ పోటీలో కళాశాల సీఎస్ఈ విభాగం విద్యార్థి బంగారు పతకం సాధించడంతో ఆమెను సత్కరించారు.

గ్రామ దేవతలు ప్రజల రక్షణ కవచాలు



పూజారికి సామగ్రిని అందజేస్తున్న రావుల చంద్రశేఖర్ రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతలు పట్టణ ప్రజలకు రక్షణ కవచాలు అని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన వనపర్తి పట్టణంలోని కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిత్య పూజల కోసం వాడే శటగోపం, తీర్థం గిన్నె, గంట మొదలగు వెండి పూజ సామగ్రిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం రావుల మాట్లాడుతూ... పట్టణంలో రహదారుల విస్తరణ అనంతరం ఆలయాల పునరుద్ధరణకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి చేశారన్నారు. గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, అశోక్, తిరుమల్, గిరి, సునీల్ పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించి మహిళ మృతి

పెబ్బేరు, మే 8(ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీకి చెందిన ఒక ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ వికటించి మహిళ గురువారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోటకు చెందిన ఫరూక్, షాహిన్(35) దంపతులు పెబ్బేరుకు 15 ఏళ్ల కిందట వలస వచ్చారు. పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగించే వారు. ఈ దంపతులకు ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. షాహినకు ఆరోగ్యం బాగోలేక నెల రోజుల కిందట ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు చేసి గర్భసంచి సమస్య ఉందని, ఆపరేషన్ చేయించుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తవని చెప్పారు. దీంతో ఆమె ఆపరేషన్‌కు ఒప్పుకుంది. గర్భసంచి ఆపరేషన్ చేస్తుండగా మృతురాలికి ఫిడ్స్, వాంతులు వచ్చి పరిస్థితి విషమంగా మారడంతో కర్నూల్‌లోని మెడికోర్ ఆసుపత్రికి తరలించారు. గర్భసంచి ఆపరేషన్ చేసిన ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం దగ్గరుండి వైద్యం చేయించారు.

చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది.


కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి

పెద్దమందడి, మే 8, (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండలం మోజర్లకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెంకుల రాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ మంత్రి పరామర్శ

పెద్దమందడి : మండలంలోని జంగమాయపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండల్ ఇటీవల బైక్‌పై వెళ్తూ.. ప్రమాదానికి గురికాగా.. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కొత్తకోటలో సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పాన్‌గల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను ఆశా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైద్యాధికారి చంద్రశేఖర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య రంగంలో కూడా కార్పొరేట్ సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. సూర్యవంశం రాము, ఆర్ఎన్ రమేష్, శ్యామల, రేణుక, మహేశ్వరి, నాగవేణి, గోవింద, వెంకటమ్మ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

వీపనగండ్ల : 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మె నోటీసును తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీఐటీయూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్స్ ఆధ్వర్యంలో అందజేశారు. సుగుణబాయి, కమల, ఎల్లమ్మ, లక్ష్మీ, రమేష్, సూర్యవంశం, రాముడు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ల విడుదల

కొత్తకోట : పట్టణ మునిసిపాలిటీ కార్యాలయంలో కార్మికులతో కలిసి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ సార్వత్రిక సమ్మె పోస్టర్లను గురువారం విడుదల చేశారు. నిక్సన్ వెంకటయ్య, శివన్న, శ్రీనివాసులు, మక్బుల్, ఇసాక్, బుచ్చన్న, రమేష్, బాలస్వామి, జాన్సన్, సుశీల, శిరీష, భాగ్యమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

అమరచింత : ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పామిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడారు.

23న జప్తు చేసిన బియ్యం వేలం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జప్తు చేసిన, మండల స్థాయి గోదాముల భద్రతా నిమిత్తం అప్పగించిన బియ్యాన్ని ఈ నెల 23న వేలం వేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు 1253.60 క్వింటాళ్ల బియ్యాన్ని కలెక్టర్ చాంబర్‌లో వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న బియ్యం ఎగుమతిదారులు వారి ఎగుమతి లైసెన్స్‌తో వేలంలో పాల్గొనవచ్చన్నారు. రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు, బియ్యం వ్యాపారులు, నిత్యావసర వస్తువులు చట్టంలోని కేసుల్లో ఉన్న వారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులని తెలిపారు. వేలంలో పాల్గొను వారు రూ.10 వేలు అదనపు కలెక్టర్ వనపర్తి పేరున డీడీ కట్టాలన్నారు. వేలంలో నెగ్గిన వారు మొత్తం సైకంను వెంటనే చెల్లించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తకోట, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌కే రెసిడెన్సీ లాడ్జి నిర్వాహకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో బాటసారుల దాహం తీర్చడానికి ముందుకొచ్చిన లాడ్జి యజమాని మురళిని ఎమ్మెల్యే అభినందించారు. ప్రశాంత్, శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, బాబు, సాయులు యాదవ్, మిషేక్ పాల్గొన్నారు.

రైతుకు అండగా ప్రభుత్వం

గోపాల్‌పేట, మే 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు రాజు అన్నారు. గురువారం మండలంలోని ఏదుట్ల, కేశంపేట రైతులకు ఏదుట్ల గ్రామంలో 25 మంది రైతులకు స్ప్రింక్లర్ పైపుల సెట్లు పంపిణీ చేశారు. దేవని విష్ణు, పెద్ద రాములు, ఈశ్వరయ్య, నాగేషి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

శ్రీరంగాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జానంపేట గ్రామ ఎస్సీ ఫెడరేషన్ కమిటీని రాష్ట్ర కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఈరపాగ రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా విజయ్, ప్రధాన కార్యదర్శిగా శివ, కోశాధికారిగా మల్లేష్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరికి సోషల్ మీడియా కన్వీనర్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాముడు, వంశీదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం పోరాడాలి

మదనాపురం,మే 8, (ఆంధ్రజ్యోతి) : బీసీలు రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం చేయాలని బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కావలి అశోక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వెనుకబడిన కులాల సమాఖ్య బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. బీసీఎఫ్ ఆశయాలకు అంకితమై పనిచేస్తూ.. గ్రామ స్థాయి నుంచి బీసీలను ఏకం చేస్తానని అన్నారు. భగవంత్, రామన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, తిరుపతియాదవ్, ఖదీర్‌పాషా పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీపనగండ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొల్లారంకి చెందిన బాలస్వామి (55) తప్పి పోయాడని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. సువర్ణ బాలస్వాములకు 32 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరు తరచుగా గొడవ పడేవారు. గొడవ పడినప్పుడల్లా బాలస్వామి ఇంటి నుంచి వెళ్లిపోవడం, రెండు, మూడు నెలలకు వచ్చేవాడు. చివరిసారిగా జనవరి 20న భార్య సువర్ణతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయి, ఇప్పటి వరకు రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెర్ప్ సీసీకి దీన్ దయాల్ అవార్డు



దీన్ దయాల్ అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఖిల్లాఘణపురం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం సెర్ప్ (ఐకేపీ) సీసీగా విధులు నిర్వహిస్తున్న శోభకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, దీన్ దయాల్ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం అవార్డును అందజేశారు. వనపర్తి జిల్లాలోనే అత్యధికంగా తన క్లస్టర్‌లోని మహిళా సమాఖ్య సభ్యులకు బ్యాంకుల్లో సుమారు రూ.11 కోట్ల రుణాలు ఇప్పించడంలో శ్రద్ధ చూపిన సెర్ప్ సీసీ శోభకు అవార్డు వచ్చినట్లు ఏపీఎం రాంబాబు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

మదనాపురం, మే 8, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగాపురంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులను గురువారం గ్రామస్థులు శాలువాలతో సన్మానించారు. యాదగిరి, దేవా, లక్ష్మణ్‌రావు, ఆంజనేయులు, అంజన్న పాల్గొన్నారు.

బాధిత బాల బాలికలకు ఉచిత న్యాయ సలహాలు



వివరాలను పొందుపరిచిన అధికారులు

ఖిల్లాఘణపురం, మే 8(ఆంధ్రజ్యోతి) : అన్యాయాలకు గురైన బాల బాలికలకు కోర్టు పరిధిలో ఉచితంగా న్యాయ సలహాలు, అందించడానికి న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో లీగల్ అడ్వైజర్లు, లాయర్లు సిద్ధంగా ఉంటారని న్యాయ సలహా సేవా సంస్థ వలంటీర్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం వనపర్తి జిల్లా పరిధిలో ఉచిత న్యాయ సలహాలు అందించే లాయర్ల ఫోన్ నెంబర్ల పోస్టర్‌ను ప్రదర్శించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాల బాలికలకు నిరుపేదలకు వృద్ధులకు కోర్టు పరిధిలో సలహాలు అందించడానికి అడ్వకేట్లు సిద్ధంగా ఉంటారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు ఉచితంగా బాల బాలికలకు నేరాల విషయంలో సంప్రదించాలని తెలిపారు. ఉత్తరయ్య, కృష్ణయ్య, ఏఎస్‌ఐ వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఐడీ కార్డులు అందజేస్తున్న సురేష్

ఆత్మకూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరికి గురవుతున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను, సిబ్బందిని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ హెల్త్ కేర్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సభ్యత్వ గుర్తింపు కార్డులను గురువారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా, ఏరియా, సామాజిక, హెల్త్ కేర్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. అనంతరం ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి కార్మికులు సత్తార్, బాలరాజు, శ్రీకాంత్, అరుణ్, శైలజ, బాలకృష్ణమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పుల్గర్‌చర్ల సంగినేనిపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. నాణ్యత ప్రమాణాలపై కేంద్రం నిర్వాహకులకు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, ఏఈవో మోహన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.